నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | డిసెంబర్ 11, 2024 | www.navatelangana.com

యువకుడి ఇంటి ముందు యువతి న్యాయపోరాటం

నవతెలంగాణ-ఖానాపూర్

ప్రేమ పేరుతో మోసం చేసిన యువకుని ఇంటి ఎదుట ఓ యువతి మౌన పోరాటానికి దిగింది. బాధితురాలి కథనం ప్రకారం..సుర్జాపూర్ గ్రామానికి చెందిన తనను మస్కాపూర్ గ్రామానికి చెందిన ఓ యువకుడు నాలుగేళ్లగా ప్రేమ పేరుతో వంచించాడని తెలిపింది. పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి ఇప్పుడు పెళ్లి మాట ఎత్తితే తనను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. దీంతో తన ప్రేమ వ్యవహారం ఇంట్లో తెలిసి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారని, తనకు ఆ యువకుడితో పెళ్లి చేసి న్యాయం చేయాలని కోరింది.

పెళ్లైన వెంటనే చెక్కులిచ్చేలా చర్యలు తీసుకోవాలి



ఆదిలాబాద్‌టౌన్ : పెళ్లైన వెంటనే లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందిస్తే వారికి ఆర్థికంగా అండగా ఉంటుందని, ప్రభుత్వం ఆ విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆదిలాబాద్ అర్బన్, రూరల్, మావల మండలాలకు చెందిన 191 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలలో మధ్య దళారులను నమ్మవద్దని సూచించారు. ఎవరికి కూడా ఒక రూపాయి కూడా ఇచ్చే అవసరం లేదని, సంక్షేమ పథకాలు లబ్ధిదారుల హక్కు అని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు ఎంతో కష్టపడి ఆడపిల్ల పెళ్లి చేస్తారన్నారు. తాను అందరికీ ఎమ్మెల్యేనని ఓటు వేసినా వేయకున్నా అందరి సంక్షేమం కోసం పనిచేస్తానని పేర్కొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెబాట

- కలెక్టరేట్ల ఎదుట దీక్షలు
- నిలిచిన సేవలు
- ఎమ్మెల్యే కోవ లక్ష్మితో పాటు పలు సంఘాల మద్దతు



కలెక్టరేట్ ఎదుట దీక్షల్లో ఎస్ఎస్ఏ ఉద్యోగులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ సర్వీస్ రెగ్యులర్ చేయాలని కోరుతూ విద్యాశాఖలో పనిచేస్తున్న సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మె మంగళవారం ప్రారంభమైంది. సమ్మెకు స్థానిక ఎమ్మెల్యేతో పాటు వివిధ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. 20 సంవత్సరాలుగా విద్య శాఖలో పనిచేస్తున్నప్పటికీ ఎటువంటి ఉద్యోగ భద్రత కల్పించకపోవడంతో ఉద్యోగులు చివరి అస్త్రంగా సమ్మె ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో వరంగల్‌లో నిరసన దీక్ష చేస్తున్న సందర్భంలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్‌తో సమ్మె చేస్తున్నారు. జిల్లాలో పని చేస్తున్న వివిధ విభాగాల ఉద్యోగులు 460 మంది సమ్మెలోకి వెళ్లారు. వీరిలో కేజీబీవీల్లో 260 మంది పనిచేస్తుండగా, ఎంఆర్సీలలో 60 మంది, ఇతర విభాగాల్లో మిగతా ఉద్యోగులు పనిచేస్తున్నారు.

నిలిచిపోయిన సేవలు

ఉద్యోగుల సమ్మెలోకి వెళ్లడంతో సేవలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. కేజీబీవీలలో విద్యార్థులకు కేవలం తిండి మాత్రమే పెట్టారు. విద్య బోధన నిలిపేశారు. అలాగే ఎంఆర్సి భవనాల్లో సేవలు నిలిచిపోయాయి. ఆన్‌లైన్ పనులు, యుడైస్, ఎండిఎం బిల్స్ ఎక్కడికక్కడ ఆగిపోయాయి. ఉద్యోగులు సర్వీస్‌ను రెగ్యులర్ చేయడంతో పాటు తక్షణమే పేస్కేల్ అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎమ్మెల్యే కోవ లక్ష్మి మద్దతు



ఎమ్మెల్యే కోవ లక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

విద్యా శాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట చేస్తున్న నిరసన దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఇచ్చిన వినతిపత్రాన్ని స్వీకరించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి గతంలో వీరికి ఇచ్చిన హామీ నెరవేర్చడంలో విఫలమయ్యారన్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. సమ్మెకు మద్దతు తెలిపిన వారిలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు లతీఫ్, పిఆర్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి చునార్కర్ అనిల్‌కుమార్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు సృతిక, ప్రధాన కార్యదర్శి పవార్ తుకారాం, గౌరవ అధ్యక్షులు కొప్పుల మోహన్, కోశాధికారి బోయిని నగేష్ యాదవ్, మీడియా ప్రతినిధి గేడెకర్ సంతోష్, కేజీబీవీ ప్రత్యేక అధికారి పద్మ, కార్యదర్శి దుర్గం సందీప్, రాజేష్, అధికార ప్రతినిధి పవన్, సీసీఓ అధ్యక్షుడు అనూప్, ఏంఐఎస్ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, ఐఈఆర్పి అధ్యక్షుడు వెంకటరమణ, పిటిఐ అధ్యక్షుడు సత్యనారాయణ, మెసెంజర్ అధ్యక్షుడు సంతోష్, డిపిఓ సిబ్బంది రాము, మల్లేష్ పాల్గొన్నారు.

రక్షణలో ప్రతి ఉద్యోగి భాగస్వామి కావాలి

- సింగరేణి సేఫ్టీ కమిటీ కన్వీనర్, ఐఎంపీ జీఎం బి.శ్రీనివాసరావు



నవతెలంగాణ - కాసిపేట

సింగరేణి సంస్థలో పని చేస్తున్న ప్రతి ఉద్యోగి రక్షణలో భాగస్వామి కావాలని సింగరేణి సేఫ్టీ కమిటీ కన్వీనర్, ఐఎంపీ జీఎం బి.శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిని 55వ రక్షణ పక్షోత్సవాలలో భాగంగా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేకే గ్రూప్ ఏజెంట్ వీ.రామదాసు, డీవైజీఎం పి శ్రీనివాస్, సేఫ్టీ ఆఫీసర్ రవీందర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సేఫ్టీ కమిటీ కన్వీనర్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సింగరేణి సంస్థలో పని చేస్తున్న ప్రతి ఉద్యోగి రక్షణలో భాగస్వామి కావాలని, ఈ సంవత్సరం రికార్డు స్థాయిలో అతి తక్కువ ప్రమాదాలు నమోదయ్యాయని తెలిపారు. దీనికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. అనంతరం మందమర్రి ఏరియా కేకే గ్రూప్ ఏజెంట్ రామదాసు మాట్లాడుతూ రక్షణ కోసం ఉద్యోగులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేసిన రక్షణ పనిముట్లను వాడాలని, రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని పేర్కొన్నారు. అనంతరం 54 వ వార్షిక రక్షణ వారోత్సవాలలో గెలుపొందిన సేఫ్టీ కమిటీ పెర్ఫార్మెన్స్, బెస్ట్ ఎన్విరాన్మెంట్ మైన్ బహుమతులను ఉద్యోగులకు అందించారు. కమ్యూనికేషన్ సెల్ ఆధ్వర్యంలో ట్రామర్ విధులు, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఉద్యోగులకు అర్థమయ్యే రీతిలో ప్రదర్శించిన లఘు నాటిక అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, గని మేనేజర్ ఎన్ భూశంకరయ్య, గని మేనేజర్, ఎస్ఈ ఉమాకాంత్, ఎస్ఎస్ఈ డి జనార్దన్‌రెడ్డి, ఎస్వో ఎం డేవిడ్, అడిషనల్ మేనేజర్లు జి శ్రీధర్‌రావు, పోషమల్లు, మెడికల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, పిట్ కార్యదర్శి లక్ష్మీనారాయణ పిట్ సెక్రటరీ, ఎస్ మనోహర్, రాజేశ్వరరావు, ఎఫ్ఎం వై రవి, ఫోర్మెన్ కె.నాగమోహన్ పాల్గొన్నారు.

రేపటిలోగా అభ్యంతరాలు తెలపండి : ఆదిలాబాద్ కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా రూపొందించిన ముసాయిదా పోలింగ్ స్టేషన్ల జాబితాపై ఏవైన అభ్యంతరాలుంటే ఈ నెల 12 లోగా తెలియజేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాజర్షి షా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మాలవియాతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను రూపొందించామన్నారు. ఈ నెల 7న జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామపంచాయతీలలో ముసాయిదా జాబితాను ప్రదర్శించడం జరిగిందన్నారు. జిల్లాలో మొత్తం 473 గ్రామ పంచాయతీలు, 3870 వార్డులు ఉండగా, 3888 పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తూ ముసాయిదా జాబితాను రూపొందించామని, ఈ ముసాయిదా జాబితాపై ఏవైన అభ్యంతరాలు ఉన్నట్లయితే ఈ నెల 12 న అన్ని మండలాల్లో అభ్యంతరాలు స్వీకరిస్తారని తెలిపారు. వచ్చిన అభ్యంతరాలను 13న పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. తుది ఓటరు జాబితాను డిసెంబర్ 17న ప్రచురించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జడ్పి సీఈఓ జితేందర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీలత, డీఎల్పీఓ ఫణీంద్ర, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీలు ప్రారంభం



నవతెలంగాణ-లోకేశ్వరం

గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల నైపుణ్యం వెలికి తీసేందుకే సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటరమేష్, తహసీల్దార్ మోతీరాం అన్నారు. మండల వ్యాప్తంగా పోటీలు ప్రారంభమయ్యాయి. మంగళవారం గడ్చంద ఉన్నత పాఠశాలలో పోటీలను ఎంపీడీవో, తహసీల్దార్ మోతీరాం కలిసి ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్ తదితర పోటీలు నిర్వహించారు. ఎంపీఈవో సోలమాన్‌రాజ్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, హెచ్‌ఎంలు ఉన్నారు.

ఖానాపూర్ : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం సీఎం కప్ మండల స్థాయి పోటీలను మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీల్లో విద్యార్థులు విద్యతో పాటు క్రీడా రంగంలో రాణించాలని అన్నారు. మండల స్థాయి క్రీడా పోటీలు జరిగాయని, బుధవారం ఖానాపూర్ పట్టణ స్థాయి క్రీడా పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు దొనికేని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, నాయకులు తోట సత్యం, ఎంపీడీవో సునీత, ఎంపీఓ రత్నాకర్‌రావు, ఎంఈఓ ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్
- అధికారులతో సమీక్ష



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

గ్రూప్-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించే గ్రూప్-2 పరీక్షల నిర్వహణపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి ఆమె అధికారులతో సమీక్షించారు. జిల్లాలో గ్రూప్-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. పరీక్షలకు జిల్లా కేంద్రంలో 24 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లాలో మొత్తం 8080 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి నియమించిన ఇన్విజిలేటర్‌లు, శాఖపరమైన అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు శిక్షణ అందించాలన్నారు. పరీక్ష పత్రాలను తీసుకువెళ్లేందుకు బందోబస్తు ఏర్పాట్లను చేసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ విధించడం జరుగుతుందన్నారు. పరీక్షలు డిసెంబర్ 15న ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం12.30 వరకు, మధ్యాహ్నం 3.00 గంటల నుండి సాయంత్రం 5.30 వరకు, అలాగే 16న ఉదయం 10గంటల నుండి 12.30 వరకు, మధ్యాహ్నం 3గంటల నుండి సాయంత్రం 5.30 వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సూచనల ప్రకారం అభ్యర్థులు వ్యవహరించాలని, మొబైల్ ఫోన్స్ ఎలక్ట్రానిక్స్ వస్తువులతో రాకూడదన్నారు. కేంద్రాలలో విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. మరుగుదొడ్లు, తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పించాలని, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్షలు జరిగే సమయాలలో అభ్యర్థుల సౌకర్యార్థం ఆయా రూట్లలో అవసరమైన బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఉపేందర్‌రెడ్డి, ఆర్డిఓ రత్నాకళ్యాణి, పబ్లిక్ సర్వీస్ రీజినల్ కోఆర్డినేటర్ పీజి రెడ్డి, విద్యాశాఖ అధికారి పి.రామారావు, ఆర్ఐఓ పరశురాం, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ రామ్మోహన్, నిర్మల్ పట్టణ, గ్రామీణ తహసిల్దార్లు రాజు, సంతోష్ పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు

జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సవరించిన ఓటరు జాబితా ప్రకారం నాలుగు కొత్త గ్రామ పంచాయతీలు కలుపుకొని మొత్తం 400 గ్రామపంచాయతీలో 3368 వార్డుల్లో 3368 పోలింగ్ కేంద్రాలున్నాయన్నారు. పెరిగిన కొత్త గ్రామ పంచాయతీలలో ఖానాపూర్ మండలంలోని రంగపేట, కడెం మండలం న్యూధర్మాజీపేట, తానూర్ మండలం కళ్యాణి, కుభీర్ మండలం రాంసింగ్‌తండా గ్రామాలు ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 2,33,687 మహిళా ఓటర్లు, 2,12,517 పురుష ఓటర్లు, 15 మంది ఇతర ఓటర్లతో కలుపుకొని మొత్తం 4,46,219 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఈ ఓటరు జాబితాపై ఏవైన అభ్యంతరాలు, సందేహాలు ఉన్నట్లయితే మండల స్థాయిలో జరగబోవు సమావేశంలో రాత పూర్వకంగా అధికారులకు వివరిస్తే, వాటిని విచారించి తుది జాబితాను ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, జెడ్పి సీఈవో గోవింద్, డిపిఓ శ్రీనివాస్, డిఎల్పిఓ రమేష్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు శ్రవణ్‌రెడ్డి, గంద్రత్ రమేష్, సిరికొండ రమేష్, గాజుల రవి, మజార్, నరేష్ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల్లో నాణ్యమైన కూరగాయలు సరఫరా చేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ఆశ్రమ పాఠశాలలో గిరిజన సహకార సంస్థ ద్వారా నాణ్యమైన కూరగాయలు, వంట సరుకులు సరఫరా చేయాలని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అన్నారు. మంగళవారం ఐటీడీఏ కార్యాలయంలో ఆశ్రమ పాఠశాలలో సరఫరా అవుతున్న సరుకులపై సమీక్షించారు. ఆశ్రమ పాఠశాలలను రెండు వారాలకొకసారి సందర్శించి కూరగాయలు, సరుకుల నాణ్యతను పరిశీలించాలని జిజిసి సిబ్బందిని ఆదేశించారు. ఏ పాఠశాలకు ఎంతెంత సరుకులు సరఫరా చేస్తున్నారు, వాటి వివరాలు రిజిస్టర్లో నమోదు చేయాలని సూచించారు. ఫోన్ సమాచారం ద్వారా సరుకులను సరఫరా చేయరాదని, సొసైటీ మేనేజర్‌లను ఆదేశించారు. కావలసిన సరుకుల పట్టికలను హెచ్‌ఎం, వార్డెన్ సంతకంతో ఉంటేనే ఏటీడీఓల వాట్సాప్ గ్రూప్ ద్వారా సమాచారం తీసుకుని సరుకులను సరఫరా చేయాలని తెలిపారు. చెడిపోయిన కూరగాయలు, నాణ్యతలేని సరుకులను సరఫరా చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. సరుకులపై నిర్ణయించిన బ్రాండ్లు తప్ప ఆశ్రమ పాఠశాలల్లో వేరే బ్రాండ్లు ఉంటే వాటి ఖరీదు చెల్లించవలసిన బాధ్యత గోడౌన్ క్లర్కు, సిబ్బందిదేనని తెలిపారు. రవాణా చేసే వాహనాలకు కచ్చితంగా జీపిఎస్ అమర్చాలని తెలిపారు. అనంతరం సరఫరా చేస్తున్న నూనె, పప్పు దినుసుల గడువు తేదీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సహకార సంస్థ డిఎం రామనందన్, సొసైటీ మేనేజర్లు, గోదాం క్లర్కులు, సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ శాఖకు భూములివ్వడాన్ని నిలిపేయాలి



నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని మద్దిమాడ ఏజన్సీ గ్రామంలోని సర్వే నెంబర్ 84లో 40 ఎకరాలు సాగు భూములను ఎలాంటి పీసా గ్రామ సభలు, అనుమతులు లేకుండా అక్రమంగా అటవీ శాఖకు అప్పజెప్పేందుకు చూస్తున్నారని, వెంటనే అటవీ శాఖకు భూములు ఇవ్వడాన్ని నిలిపి వేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు, ఆదివాసీ గిరిజన గ్రామస్తులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో తహసీల్దార్ భోజన్నకు ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. దీంతో పాటు ఎంపీడీవో సత్యనారాయణ సింగ్ కూడా వినతిపత్రం అందించారు. ఎన్నో ఏళ్లుగా పేద ఆదివాసులు సాగు చేసుకుంటున్న భూములను సిమెంట్ కంపెనీ కోసం అటవీ శాఖకు అప్పగిస్తే పేద ఆదివాసులు నష్టపోవడం జరుగుతుందన్నారు. కంపెనీ కోసం కాకుండా ఎప్పటి నుంచో సాగు చేస్తున్న ఆదివాసుల కోసం ఆలోచించి తక్షణమే అటవీ శాఖకు భూములను ఇవ్వడాన్ని నిలిపి వేసి న్యాయం చేయాలని కోరారు. లేకుంటే ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనబాట పడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ ఆడె జంగు, జిల్లా నాయకులు పెంద్రం హన్మంతు, మడావి అనంతరావు, కనక గోవర్ధన్, నాయిడి రాజన్న, రాయిసిడాం రాందాస్, మనోజ్‌కుమార్, నాయిడి మల్లేశ్, బైర్నేని రాజన్న, బాలరాజు, రొడ్డ మల్లేశ్, బండారి వెంకటేష్, దూనే లక్ష్మణ్, రొడ్డ చంద్రయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

క్రీడాకారులు అత్యుత్తమ క్రీడా ప్రతిభ కనబర్చాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-నస్పూర్

క్రీడాకారులు పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం సిఎం కప్-2024 పోటీలలో భాగంగా నస్పూర్ మండలంలో గల ప్రాణహిత స్టేడియంలో నిర్వహించిన మున్సిపల్ స్థాయి క్రీడా పోటీలను జిల్లా యువజన క్రీడా అధికారి కీర్తి రాజ్‌వీర్, సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ ఏరియా జిఎం ఎల్‌వి సూర్యనారాయణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, క్రీడా రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థులకు మంచి భవిష్యత్తు అందించే దిశగా కృషి చేస్తుందని తెలిపారు. ఈ క్రమంలో తెలంగాణ క్రీడా విశ్వవిద్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, క్రీడల కోటా కింద అన్ని ఉద్యోగాలలో ప్రత్యేక రిజర్వేషన్ కల్పించి ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడం జరుగుతుందని తెలిపారు. సిఎం కప్ పోటీలలో భాగంగా ఈ నెల 7, 8 తేదీలలో గ్రామపంచాయతీ స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించి ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను గుర్తించి 12 వరకు జరుగనున్న మండల, మున్సిపాలిటీల స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఈ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులను ఈ నెల 16 నుండి 21 వరకు జరుగనున్న జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లా స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందని, రాష్ట్ర స్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రదర్శన అందించిన వారికి తగు శిక్షణ అందించి అంతర్రాష్ట్ర, జాతీయ స్థాయికి పంపించడం జరుగుతుందని తెలిపారు. జాతీయ స్థాయి క్రీడాకారులను మరింత ప్రోత్సహించడం జరుగుతుందని, క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని పెంపొందించుకొని అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రదర్శనతో తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నస్పూర్ మున్సిపల్ చైర్మెన్ వేణు, కమిషనర్ సతీష్, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
బుధవారం | డిసెంబర్ 11, 2024 | www.navatelangana.com

ఘనంగా మానవ హక్కుల దినోత్సవం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మావన హక్కుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా చైర్మెన్ గురువ పున్నంరావు నేతృత్వంలో ఈ దినోత్సవాన్ని నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అసోసియేషన్ ఆధ్వర్యంలో గత తొమ్మిది సంవత్సరాలుగా అనేక సేవలందిస్తున్నామన్నారు. చట్టాలపై విస్తృత అవగాహన కల్పిస్తూ, విద్యార్థులు, యువకులు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలను చైతన్య పరుస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు ఉన్నారు.



బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని గోదారిగూడ గ్రామానికి చెందిన బోర్లకుంట బుచ్చన్న కొన్ని రోజుల కింద అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న ఉట్నూర్ మండల నేతకాని సంఘం నాయకులు మంగళవారం వారి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఉట్నూర్ నేతకాని సంఘం అధ్యక్షులు గోళ్లపెల్లి నర్సయ్య, ఉపాధ్యక్షులు దూట మహేందర్, కోశాధికారి గోల్లే పవన్, జాడి రాజేశ్వర్, సొగల ప్రవీణ్, దూట శ్రీనివాస్, గోదారి వినోద్, సన్నీ సుభాష్, రవి పాల్గొన్నారు.



సమ్మెబాట పట్టిన ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు

- హక్కులను కాలరాస్తున్న సీఎం
- ఎన్టీఆర్ చౌక్‌లో నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యాశాఖలో అంతర్భాగంగా ఉన్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో గత ఐదు రోజులుగా నిరవధిక దీక్షలు చేపట్టారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో మంగళవారం నుంచి సమ్మెబాట చేపట్టారు. ఇందులో భాగంగా పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్‌లో ఎస్ఎస్ఏ ఆకారంలో ఉద్యోగులు కూర్చొని నిరసన తెలిపారు. మానవ హక్కుల దినోత్సవం రోజున సీఎం రేవంత్‌రెడ్డి తమ హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు. అధికారంలోకి రాకముందు సీఎం రేవంత్ రెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం నాయకురాలు ప్రియాంక తెలిపారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్న ఇప్పటి వరకు దాని ఊసే లేదన్నారు. ప్రభుత్వ వైఖరి కారణంగా తాము సమ్మె బాట పట్టామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రెగ్యులర్ చేయడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు తమ సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్, పార్థసారథి, దేవదర్శన్, ప్రకాష్, ప్రియంక, రాజన్న, శ్రీకాంత్, బోజన్న పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులకు పీఆర్టీయూటీజీ మద్దతు..

సమగ్ర శిక్ష అభియాన్‌ల నాయమైన డిమాండ్‌లు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నేరవేర్చాలని పీఆర్టీయూటీజీ అధ్యక్ష, కార్యదర్శులు ఆడే నూర్‌సింగ్, నర్ర నవీన్ యాదవ్ అన్నారు. కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న సమగ్ర ఉద్యోగుల సమ్మెకు మంగళవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం, కాంట్రాక్ట్ వర్కర్లను రెగ్యులర్ చేయాలని గతంలో నిరసన తెలిపిన సమయంలో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వారి డిమాండ్ల నెరవేరుస్తానని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయిన డిమాండ్లను నెరవేర్చడం మర్చిపోయారన్నారు. అందుకోసమే ఎస్ఎస్ఏ రాష్ట్ర కమిటీ వారందరూ ఆయా ప్రాంతాల్లో రోడ్లెక్కి నిరసనలు తెలుపుతున్నారన్నారు.

ఎస్ఎస్ఏ సమ్మెకు మాజీ మంత్రి జోగు రామన్న మద్దతు...

అధికారంలోకి వస్తే చాయ్ తాగే గంటలోపు రెగ్యులర్ చేస్తామని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి సంవత్సరం గడిచిన ఎందుకు హామీ నిలబెట్టుకోలేదని మాజీ మంత్రి జోగు రామన్న ప్రశ్నించారు. కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న సమగ్ర ఉద్యోగుల సమ్మెకు మంగళవారం మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న మద్దతు తెలిపారు. సమ్మె శిబిరాన్ని సందర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నామని, తాము అధికారంలో ఉన్న సమయంలో చేయలేకపోయమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, దానికి అనుగుణంగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రూల్ ఆఫ్ రోస్టర్ ప్రకారం నియమకాలు జరిగాయని వంద శాతం వీరిని రెగ్యులర్ చేయాలన్నారు. అప్పటి వరకు ఉద్యోగుల ఆందోళనలకు బీఆర్ఎస్ మద్దతుగా ఉంటుందని పేర్కొన్నారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ నాయకులు ప్రహ్లాద్, నారాయణ, ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్, పార్థసారథి, దేవదర్శన్, ప్రకాష్, ప్రియంక, దీప్తి, రాజన్న, శ్రీకాంత్, బోజన్న పాల్గొన్నారు.



ఉమ్రు సర్వీసెస్ ఆధ్వర్యంలో శిక్షణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్‌లో గదీమ్ బుర్రాక్ టూర్ అండ్ ట్రావెల్స్ హజ్ అండ్ ఉమ్రా సర్వీసెస్ ఆధ్వర్యంలో ఒకరోజు ఉమ్రా శిక్షణా శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. పట్టణంలోని ఓ ప్రయివేటు ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఈ శిబిరం గదీమ్ బుర్రాక్ హెడ్ మోసిన్ పర్యవేక్షణలో కొనసాగింది. శిబిరంలో మౌలానా సయ్యద్ మోబీన్, సర్దార్ రహ్మనీ యాత్ర నియమాలు, ప్రార్థనలు, ఇతర ముఖ్య సమాచారాన్ని యాత్రికులకు వివరించి సందేహాలను నివృత్తి చేశారు. గదీమ్ బుర్రాక్ టూర్ అండ్ ట్రావెల్స్ 2021లో ప్రారంభమైందని, ఇప్పటి వరకు చాలామంది ముస్లీం పర్యాటకులు ఈ సేవలను వినియోగించుకుని ఉమ్రా వెళ్లారని తెలిపారు. ఈ నెల 15న 40 మంది సభ్యులతో ఉమ్రా యాత్ర ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ యాత్రలో ఉపాధ్యాయులు ప్రయాణికుల వెంట ఉంటారని, అదే తమ ప్రత్యేకత అంటూ తెలియజేశారు.

సంక్షేమ పథకాలు ఇంటింటికి చేరేలా కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరేలా తమవంతు కృషి చేస్తామని, అధిష్టానం ఆదేశాలకు అనుగుణంగా కట్టుబడి నడుచుకుంటామని యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అర్బాత్ ఖాన్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. పేదవాడు సైతం రాజకీయాల్లోకి రావచ్చునే రాహుల్ గాంధీ నినాదంతో కాంగ్రెస్‌లో చేరామన్నారు. ఇటీవల జరిగిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో తమను గెలిపించిన ప్రతిఒక్కరికీ పేరుపేరును ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనకు అనుగుణంగా సాగుతున్న ప్రజాపాలనలో భాగంగా ప్రభుత్వ పథకాలను ప్రజల దరిచేరేలా చూస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అసెంబ్లీ అధ్యక్షుడు నాహిద్, ప్రధాన కార్యదర్శి అశోక్, పట్టణ అధ్యక్షుడు సుగత్ కుమార్ నాయకులున్నారు.

ఆశా వర్కర్ల ముందస్తు అరెస్టు

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్‌లో ఒక రోజు ధర్నా చేపట్టడానికి బయలుదేరిన నిర్మల్ జిల్లా ఆశా కార్యకర్తలను తూప్రాన్ పోలీసులు మధ్యలో అడ్డుకొని అరెస్టు చేశారు. అనంతరం వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తమ సమస్యల పరిష్కారానికి నిరసన తెలపడానికి వెళుతున్న తమను అక్రమంగా అరెస్టు చేయడం ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు.

రేపు ఆదిలాబాద్‌లో వాహనాల వేలం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల వివిధ కేసులలో పట్టుబడిన వాహనాలను ఈ నెల 12న వేలం వేస్తున్నట్టు ఎక్సైజ్ సీఐ విజేందర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 13 ద్విచక్రవాహనాలు, ఒక టాటా కారు మొత్తం 14 వాహనాలను గురువారం ఉదయం ఎక్సైజ్ అధికారిణి హిమశ్రీ ఆధ్వర్యంలో వేలం వేస్తున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ప్రభుత్వం ద్వారా నిర్దేశించిన ధరావతు సొమ్మును చెల్లించి బహిరంగ వేలం పాటలో పాల్గొనవచ్చని సూచించారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం

- సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన
- స్వల్ప తోపులాట



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా చలో హైదరాబాద్‌కు వెళ్లే ఆశాలను, సీఐటీయూ నాయకులను ఎక్కడికక్కడ నిర్బంధించడాన్ని లాఠీచార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న అన్నారు. ఆశాలపై జరిగిన లాఠీ చార్జీని ఖండిస్తూ, ఆశాల సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం బస్టాండ్ వద్ద నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేయడానికి ప్రయత్నించారు. దీంతో పోలీసులు అడ్డుకోవడంతో స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆశాలకు రూ.18వేల వేతనం పెంచుతామన్న హామీని అమలు చేయమంటే రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధం ప్రయోగిస్తుందని విమర్శించారు. మహిళలని కనీసం సోయిలేకుండా మగ పోలీసులతో కొట్టించడం అన్యాయమన్నారు. ప్రజాపాలన అంటూ నిరసనలు తెలిపే హక్కును కాలరాస్తున్నదని మండిపడ్డారు. రేవంత్ సర్కార్ పోలీసులను నమ్ముకొని పరిపాలిస్తుందన్నారు. అలాంటి ప్రభుత్వాలు మనుగడ సాధించలేవన్న సత్యాన్ని గుర్తిస్తే మంచిదని హితవు పలికారు. వెంటనే ఆశాల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న, ఆశ యూనియన్ నాయకులు లక్ష్మి, పుష్పలత, ఆశా, పార్వతి, దీక్ష, సంగీత, సుజాత, శాంత, స్వప్న పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహించేందుకు సీఎం కప్ పోటీలు

- క్రీడా పోటీలను ప్రారంభించిన అదనపు కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేందుక ప్రభుత్వం సీఎం కప్ ద్వారా పోటీలను నిర్వహిస్తుందని, క్రీడాకారులు, విద్యార్థులు ప్రతిభను చాటాలని అదనపు కలెక్టర్ శ్యామలదేవి అన్నారు. మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మంగళవారం నిర్వహించారు. దీనికి అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ముందుగా ఆమెకు స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం క్రీడాకారులని పరిచయం చేసుకుని విద్యార్థులతో కలిసి కబడ్డి ఆడి ఉత్సహపరిచారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామలదేవి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం కలిగిన ఎంతో మంది క్రీడాకారులున్నారన్నారు. వారికి సరైన ప్రోత్సహం అందించేందుకు సీఎం కప్ క్రీడా పోటీలు ఎంతో దోహదం చేస్తామన్నారు. గ్రామ స్థాయిలో రెండు రోజుల పాటు పోటీలు జరిగాయన్నారు. మండల స్థాయిలో ఎంపికైన వారికి పోటీలు నిర్వహిస్తున్నామని, ఇక్కడ గెలుపొందిన వారికీ జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. అర్బన్ క్రీడ పోటీలు బుధవారం స్టేడియంలో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. క్రీడా స్ఫూర్తితో ఆడి రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ వెంకటేశ్వర్లు, గిరిజన క్రీడాలాభివృద్ధి అధికారి పార్థసారథి, ఎస్జీఎఫ్ కార్యదర్శి కాంతారావు, పేట సంఘం కార్యదర్శి ఎన్.స్వామి, ఎంఈఓ సోమయ్య, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రజా పాలన విజయోత్సవ సంబరాలు



నవతెలంగాణ-తలమడుగు

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రజా పాలన సంవత్సరం పూర్తయిన సందర్భంగా మండలంలోని ఉండం గ్రామ అయుషాగార్డెన్‌లో ప్రజాపాలన దినోత్సవ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. బోథ్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన దిశలో ముందంజలో ఉందన్నారు. గత ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఖజానాను ఇష్టానుసారంగా అమలు చేయడంతో అప్పుల పాలు చేసినప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలకు ఉచిత ప్రయాణం వేలాది ఉద్యోగాలు అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు గోక గణేష్‌రెడ్డి, మల్లెపూల నర్సయ్య, మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు గంగారెడ్డి, కుమ్ర కోటేష్, మాజీ ఎంపీపీలు కళ్యాణం లక్ష్మీ రాజేశ్వర్, ఆడే శీల, శ్రీధర్‌రెడ్డి, నరేష్, నాయకులు పసుల చంటి, ప్రఫుల్‌రెడ్డి, మైముద్‌ఖాన్, పోతారెడ్డి యూత్ కాంగ్రెస్, ప్రకాష్ రావు, వెంకన్న యాదవ్, నారాయణరెడ్డి, రమేష్, అశోక్, బాలాజీ, పటేల్, బ్రహ్మానందం అన్ను పటేల్, రఫిక్, సాంబశివ, దేవదాస్, ప్రవీణ్‌రెడ్డి, బోథ్ నియోజకవర్గంలోని అన్ని మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు



నవతెలంగాణ-ముథోల్

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం అట్టసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా తహశీల్దార్ శ్రీకాంత్ హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యాన్ని, క్రీడా సాంస్కృతిని పెంచుతుందన్నారు. విద్యార్థులు క్రీడాలతో పాటు చదువులో కూడా రాణించాలని అన్నారు. మండలంలోని 13 గ్రామపంచాయితీల నుండి 300 వరకు క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ క్రీడలు రెండు రోజులు కొనసాగుతాయని ఎంపీడీఓ శివకుమార్ తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐ మల్లేష్, ఎంఈఓ రమణరెడ్డి, గ్రామపంచాయితీ ఈఓ ప్రసాద్ గౌడ్, పీడీ శ్రీనివాస్, ఆయా పాఠశాలల హెచ్ఎం, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆయిల్ ఫాం సాగుపై రైతులకు అవగాహన



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని యాపల్‌గూడ, మేడిగూడ, సైదుపూర్ సాంగి గ్రామాలలో మంగళవారం క్షేత్ర పర్యటనలో భాగంగా ఆయిల్ ఫాం సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ కే రాజశేఖర్, డాక్టర్ మోహన్ దాస్, డాక్టర్ ఎం సునీల్, డాక్టర్ జీ.శివ చరణ్ ఆయిల్ పంటలో కొమ్ము పురుగులు నివారణ, లింగాకర్షణ బుట్టలు ఎకరానికి ఒకటి చొప్పున అమర్చుకొని వాటి నివారణ చర్యలు తెలియజేశారు. శనగ పంటలో ఎండు తెగులు, కంది పంటలో సెనగపచ్చ పురుగు, పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణకు చర్యలను రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

బాలకార్మిక, బాల్య వివాహాలపై అవగాహన



నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని మన్మథ్ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు బాల కార్మికులు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. మంగళవారం బాలలకు అందుబాటులో న్యాయం అనే కార్యక్రమంలో భాగంగా కార్యకర్త నాగభూషణం పలు చట్టాలు, హక్కుల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు దేవేందర్, ఉపాధ్యాయులు సుధీర్ కుమార్, ప్రశాంత్, విజయ కుమారి పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని నందిగామ పాఠశాల విద్యార్థులు మధ్యాహ్నం భోజనంలో ప్లేట్స్ లేకపోవడంతో ఇబ్బంది పడుతన్నారన్న విషయం తెలుసుకున్న సామాజిక కార్యకర్త ముడుపు మానిశ్ రెడ్డి మంగళవారం పాఠశాలను సందర్శించి విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నందిగామ గ్రామస్తులు, ఉపాధ్యాయిలు మౌనిష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ దామోదర్ రెడ్డి, కేదరీశ్వర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ బాబన్న, పాఠశాల కమిటీ చైర్మన్ గిరిజ, ప్రధానోపాధ్యాయులు భీంరావు, ఉపాధ్యాయుడు దివాకర్, గ్రామ పటేల్ లక్ష్మణ్, పిసారామ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ కార్యక్రమానికి అనుమతినివ్వాలి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్



అంగన్‌వాడీ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 12న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమానికి అనుమతినివ్వాలని అంగన్‌వాడీ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఏపీడీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ శీతాకాల సమావేశాల సందర్భంగా గత ప్రభుత్వ హయాంలో చేసిన సమ్మె ఫలితంగా ఇచ్చిన హామీలు ఈ ప్రభుత్వం కూడా నేటికీ అమలుపరచలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్, అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.లలిత కోశాధికారి శైలజ, జిల్లా అధ్యక్షులు విజయ పాల్గొన్నారు.

ఉచిత కంటి శిబిరానికి విశేష స్పందన

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ మల్టిస్పెషలిటీ ఆస్పత్రిలో కొత్తపల్లి వెంకట లక్ష్మీ-చంద్రయ్య మెమోరియల్ సర్విస్ సొసైటీ వ్యవస్థాపకులు, బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, డాక్టర్ కొత్తపల్లి అనిత ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచితం కంటి పరీక్షలకు స్పందన వచ్చింది. ఈ శిబిరంలో 28 మంది హాజరు కాగా వారిలో 11 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. వీరికి లయన్స్ క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి వారి సహకారంతో ఉచితంగా ఆపరేషన్ చేపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆప్తమలజిస్ట్ శ్రీనాథ్, ఐ క్యాంప్ ఇన్‌చార్జి గోపి పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఏటీఎం ప్రారంభం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఎస్‌బీఐ ఏటీఎంను కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ లోకేశ్వరరావు, బ్యాంకు రీజినల్ మేనేజర్ రితేష్ కుమార్ గుప్తా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ విజయ్ భాస్కర్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వర్ జోషి, జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్, బ్యాంకు మేనేజర్ రవికుమార్ పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారికి సన్మానం



నవతెలంగాణ-పెంచికలపేట్

ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు గణపురం సంతోష్ ఆధ్వర్యంలో నూతనంగా మండల వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహిస్తున్న మిరియాల మనీషను మండల ఆర్యవైశ్య సంఘం, మహిళా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని రామాలయం ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులని రంగాల్లో ముందుండాలని, ప్రభుత్వ ఉద్యోగం సాధించిన మనీషాని చూసి స్ఫూర్తి పొంది ఆర్యవైశ్యులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మండల ప్రధాన కార్యదర్శి రావుల కృష్ణ, కోశాధికారి చిలువేరు భాస్కర్, సభ్యులు రాచకొండ రమేష్, నరేందర్, కృష్ణ, రాజు, రామన్న, నాగేష్, హరికృష్ణ, వెంకటేష్, వెంకన్న, వినోద్, రాజకుమార్, సత్యనారాయణ, సందీప్, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనలో అంగన్‌వాడీలు కీలకం



నవతెలంగాణ-వాంకిడి

బాల్యవివాహాలను నిర్మూలించడంలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్ల పాత్ర కీలకమని జిల్లా బాలల సంరక్షణ విభాగం సోషల్ వర్కర్ డోంగ్రి ప్రవీణ్ కుమార్, చైల్డ్ లైన్ పీతాంబర్ తెలిపారు. మంగళవారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఆవరణలో ఐసీడీఎస్ సీడీపీఓ రెబిక అధ్యక్షతన బాల్య వివాహ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధకం చట్టం 2006 ప్రకారం అమ్మాయి వయసు 18ఏండ్లు, అబ్బాయి వయసు 21 ఏండ్లు ఉండాలని, నిర్దేశిత వయసులోపు పెళ్లి చేస్తే చట్టరీత్యా నేరమన్నారు. బాల్యవివాహాలను ఎవరు ప్రోత్సహించినా, పెళ్లి చేసినా రూ. లక్ష జరిమానా, మూడేండ్ల జైలు ఉంటుందని తెలిపారు. బాల్య వివాహాల వల్ల మహిళల ఆరోగ్యంపై ప్రభావం పడుతుందన్నారు. జిల్లాను బాల్య వివాహ ముక్త్ జిల్లాగా తీర్చిదిద్దేందుకు జిల్లాలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. బాల్య వివాహాలు ఎక్కడ జరిగినా టోల్ ఫ్రీ నెంబర్ 1098 లేదా 100కు తెలియజేయాలని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు లత, కుమారి, భారతి, అంగన్‌వాడీ టీచటర్లు పాల్గొన్నారు.

గ్రామ యువకుల శ్రమదానం



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని మొర్లిగూడ గ్రామానికి వెళ్లే రహదారిని గ్రామ ఆదివాసీ అధ్యక్షుడు తలని మధుకర్ ఆధ్వర్యంలో గ్రామస్తులు కలిసి మంగళవారం శ్రమదానం చేసి రోడ్డు పై గుంతలను పూడ్చారు. శ్రమదానంలో భాగంగా రోడ్డుపై గుంతలను మొరం వేసి ట్రాక్టర్‌తో చదను చేశారు. శ్రమదానం కోసం గ్రామస్తులందరూ చందాలు వేసుకుని రోడ్డుకు మరమ్మతులు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని పంటలను అమ్ముకోవడానికి, వాహనాలు రాకపోకలు కొనసాగించడానికి ఇబ్బందుల దృష్ట్యా రోడ్డుకు మరమ్మతులు చేసుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కామెర ప్రభాకర్, గ్రామస్తులు జగదీష్, రామయ్య, గురుదాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉచిత గర్భ కోశ నివారణ పశు వైద్య శిబిరం



నవతెలంగాణ-కౌటాల

ఉచిత పశు గర్భ కోశ వ్యాధి నివారణ శిబిరాన్ని మండలంలోని గుండాయిపేట్ గ్రామంలో నిర్వహించామని పశు వైద్య అధికారి శ్రీకాంత్ అన్నారు. ఈ సందర్భంగా పశువులకు గర్భ కోశ వ్యాధి నివారణ టీకాలు, ఎదకు రాని, గర్భ కోశ వ్యాధి బారిన పడిన పశువులను గుర్తించి చూడీ పరీక్షలు చేసి మందులు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ముత్తంపేట్ పశు వైద్య అధికారి అంజలి, సిబ్బంది సత్యనారాయణ, సందీప్, భిక్షపతి, ప్రకాష్, రైతులున్నారు.

వణికిపోతున్న సరిహద్దు గ్రామాలు

- పులి వరుస దాడులతో గిరిజనుల్లో బయం
- అప్రమత్తంగా ఉండాలని సూచన



నవతెలంగాణ-సిర్పూర్(టి)

మహారాష్ట్ర, తెలంగాణ బోర్డర్ నుంచి జిల్లాలో పులుల సంచారం పెరగడంతో సరిహద్దు మండలాల్లోని గ్రామాల ప్రజలు వణికిపోతున్నారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో ఆసిఫాబాద్ జిల్లా కోర్ ఏరియాగా(పులులు వచ్చే అవకాశం ఉన్న ప్రాంతం, రావచ్చు, రాకపోవచ్చు) ఉంది. అయితే ప్రస్తుతం ఇదే ప్రాంతంలో పులులు పెద్ద ఎత్తున తిరుగుతుండడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అటవీ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు వారిని అప్రమత్తం చేస్తున్నారు. కాగజ్‌నగర్ డివిజన్ అటవీ తీర ప్రాంతాల్లో ఉన్న గ్రామ ప్రజలు తమ ప్రాణాలను అరిచేతులో పెట్టుకొని బిక్కుబిక్కు మంటూ రోజులు గడుపుతున్నారు. కొన్ని రోజుల నుండి కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని కాగజ్‌నగర్, సిర్పూర్, బెజ్జూర్, కౌటాల మండల ప్రజలు పులి సంచారంతో భయంభయంగా ఉంటున్నారు.

పులి దాడితో హడలిపోతున్న జనం

కొన్ని రోజుల క్రితం కాగజ్‌నగర్ మండలంలోని గన్నారం గ్రామంలో పత్తి చేనులో పత్తి తీస్తుండగా శారద అనే మహిళపై దాడి చేయగా మృతి చెందింది. సిర్పూర్(టి) మండలంలో సురేష్ అనే రైతుపై దాడి చేసి తీవ్ర గాయాలు చేయగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. చిలపెల్లి గ్రామంలో లేగుదుడపై దాడి చేయగా మృతి చెందింది. తాజాగా మంగళవారం ఉదయం హుడికిలి గ్రామంలో చొరబడి కట్టిఉన్న లేగదూడపై దాడి చేసింది. పులి మనుషులు, పశువులపై దాడులు చేయడంతో చేతికి వచ్చిన పత్తి పంట తీయడానికి, పశువుల కాపరులు అడవిలో పశువులను మేపడానికి తీసుకువెళ్లాలంటే జంకుతున్నారు. సిర్పూర్(టి) మండలంలో లింబుగూడా, పూసుగూడా, చీలపల్లి, ఇటిక్యాల్ పహాడ్, మాకిడి, జక్కాపూర్, హుడికిలి నమేగం, భూపాలపట్నం తదితర అటవీ తీర ప్రాంత గ్రామాలలో పులి సంచారం ఎక్కువగా ఉంది. ఈ గ్రామ రైతులు తమ పంట పొలంలో పనులు, నిత్యావసర పనుల కోసం మండల కేంద్రానికి వచ్చే ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అటవీ శాఖ ఉన్నత అధికారులు స్పందించి పులులు సంచారాన్ని అరికట్టాలని కోరుతున్నారు.

టైగర్ క్యాడిడార్ నిర్మాణం కోసమే..?

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాగజ్‌నగర్ అడవి డివిజన్‌ను టైగర్ క్యారిడార్(పులి నడిచే ప్రాంతం)గా నిర్మించాలని ఆలోచనలో ఉందని, క్యారిడార్ జోన్‌కే అటవీ శాఖ సిబ్బంది పులలను వదిలి పెట్టారేమోనని ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి జరగడం ఒక ఎత్తు అయితే మనుషులు, పశువుల ప్రాణాలను పులి తీస్తుందని ప్రజలు అంటున్నారు. పులి బారి నుంచి తమను కాపాడాలని అటవీ శాఖ అధికారులను విన్నవిస్తున్నారు.

అటవీ శాఖ సిబ్బంది స్పందించాలి

నాగేందర్, రైతు హుడికిలి



అడవిని ఆనుకొని ఉన్న గ్రామాలలో పులి సంచారం ఎక్కువగా ఉంది. దీంతో మా చేతికి వచ్చిన పత్తి పంటను తీయడానికి వెళ్లాలన్న, రాత్రి సమయాలలో ఇంటి బయటకు వెళ్లాలన్న భయంగా ఉంది. పశువులు, మనుషులపై కూడా దాడి చేస్తుంది. అటవీ శాఖ సిబ్బంది స్పందించి పులిని వేరే ప్రాంతానికి తరలించే విధంగా చర్యలు తీసుకోవాలి.

విగ్రహం మార్చి అవమాన పరిచారు

- తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ శ్రేణుల పాలాభిషేకం



ఆసిఫాబాద్ : పాలాభిషేకం చేసి నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చి ఆ తల్లిని అవమానపరిచారని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మంగళవారం పార్టీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పాలభిషేకం చేసి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో స్ఫూర్తినిచ్చిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చి తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవాన్ని రేవంత్ రెడ్డి కించపరచారని ఆరోపించారు. కేవలం సోనియాగాంధీ మెప్పు కోసమే కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సాంస్కృతిక చిన్నహాలను మార్చే కుట్ర చేస్తుందని రానున్న రోజుల్లో ప్రజల నుంచి తిరుగుబాటు వస్తుందన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ హైమద్, మాజీ జడ్పీటీసీ అజయ్ కుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిలువేరు వెంకటేశ్వర్లు, నాయకులు గంధం శ్రీనివాస్, భీమేష్, రవి, సాజిద్, అన్సర్, హైమద్, నిసార్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ ఆవరణలో తెలంగాణ తల్లి చిత్రపటానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బిట్టు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్పు చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని, మన సాంస్కృతి సాంప్రదాయాలైన బతుకమ్మను విగ్రహంలో ఉంచకపోవడం, విగ్రహాన్ని మార్చడం సరైన పద్ధతి కాదని అన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కో కన్వీనర్, సమన్వయకర్త కొండ రాంప్రసాద్, మండల యూత్ అధ్యక్షులు బండి మహేష్, యూత్ ఉపాధ్యక్షులు వసాల రాజవర్ధన్, మండల నాయకులు సంపుటం గోపాల్, తైదల రవికుమార్, కెమెరా మొండి, పొట్టే గంగన్న, తిరుపతి, విజయ్, తొగయ్య, రాజన్న, కిష్టయ్య, అశోక్ పాల్గొన్నారు.

రెబ్బెన : గోలేటి గ్రామపంచాయతీలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లికి పాలాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. తెలంగాణ తల్లి అంటే కేవలం విగ్రహం కాదని, తెలంగాణ తల్లి మన ఉద్యమాల కేతనం, మన స్వాభిమాన సంకేతమని, తెలంగాణ తల్లి మన అస్తిత్వ ప్రతీకని తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం అంటే తెలంగాణ స్ఫూర్తిని అవమానించడమే అని నాయకులు అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు, పోటు శ్రీధర్ రెడ్డి, గ్రామ ఇన్‌చార్జి పంబాల శ్రీనివాస్, గోలేటి మాజీ సర్పంచ్ సుమలత, ఆసిఫాబాద్ మాజీ మార్కెట్ చైర్మన్ వనజ, మాజీ ఎంపీటీసీ మల్లయ్య, నరేందర్, ఆసిఫ్, లక్ష్మణ్, నాయకులు వెంకటేష్, వినోద్, రవి దయాకర్, సత్యనారాయణ, కృష్ణ, శంకరమ్మ, గణేష్, కృష్ణ స్వామి, గణేష్ రాజేశ్వర్, పార్వతి అశోక్ పాల్గొన్నారు.



పెంచికల్‌పేట్ : తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే సీఎం కప్ క్రీడలు

- యువజన క్రీడల జిల్లా అధికారి రామాదేవి

నవతెలంగాణ-కెరమెరి

గ్రామీణ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే ప్రభుత్వం సీఎం కప్ పోటీలను నిర్వహిస్తోందని యువజన, క్రీడల అధికారిణి రామాదేవి అన్నారు. మంగళవారం మండలంలోని మోడీ ఆశ్రమ బాలికల, హట్టి బాలుర ఆశ్రమ పాఠశాలలో మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని తెలిపారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శరీరక ధృఢత్వం ఏర్పడుతుందన్నారు. మండల స్థాయిలో క్రీడలు ఏర్పాటు చేయడంతో విద్యార్థుల మధ్య స్నేహ భావం పెంపొందుతుందన్నారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చాన్నారు. ప్రతి పాఠశాల విద్యార్థి చదువులతో పాటు క్రీడల్లో సైతం రాణించి పాఠశాలకు గుర్తింపు తెవాలన్నారు. అనంతరం వివిధ పాఠశాలల నుంచి క్రీడల్లో పాలు పంచుకునేందుకు వచ్చిన విద్యార్థులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఆడే ప్రకాష్, తహసీల్దార్ దత్తు ప్రసాద్ రావు, ఎంపీడీఓ అంజాద్ పాషా, మోడీ, హట్టి ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నర్సయ్య, పంచపూల, గ్రామస్తుడు ఆత్రం లక్ష్మణ్ రావు పాల్గొన్నారు



కెరమెరి : క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీవైఎస్‌ఓ

పెంచికల్‌పేట్ : మండల స్థాయి సీఎం కప్ పోటీలు ప్రారంభమయ్యాయి. మంగళవారం కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోటీలను మండల ప్రత్యేక అధికారి ప్రభాకర్ రావు, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ ఆల్బర్ట్, ఎస్సై కొమురయ్య మంగళవారం ప్రారంభించారు. మండలంలోని చేద్వాయి ఉన్నత పాఠశాల, ఏల్లూరు గ్రామంలోని ఆశ్రమ పాఠశాల, కమ్మర్గాం ఆశ్రమ పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు పంపనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాదగిరి, పంచాయతీ కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయుడు తిరుపతి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కౌటాల : సీఎం కప్ మండల స్థాయి క్రీడాలను మండల విద్యాధికారి గావుడే హన్మంతు మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల గ్రామస్థాయిలో ఆడి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మండల స్థాయికి ఎంపిక చేశామన్నారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. ఇందులో ఖోఖో, కబడ్డీ ఆటలను ఆడించడం జరుగుతుందన్నారు. మరో రెండు రోజుల పాటు ఈ క్రీడలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ మహేందర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్యాంరావ్, పీడీలు, పీఈటీలు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెబ్బెన : సీఎం కప్ మండల స్థాయి పోటీలు గోలేటిలోని సింగరేణి స్కూల్లో జరిగాయి. తహశీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సంపత్ కుమారు, జిల్లా ఉపాధ్యక్షుడు బోగే ఉపేందర్, యోగ అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీ కేసరి ఆలేఖ్య, స్కూల్ హెచ్‌ఎం రవితేజ, పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.



పెంచికల్‌పేట్ : క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మండల ప్రత్యేక అధికారి



కౌటాల : క్రీడాకారులతో ఎంఈఓ, ఉపాధ్యాయులు

జీఓ నెంబర్ 22 అమలు చేసి వేతనాలు పెంచాలి



నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు జీఓ నెంబర్ 22 అమలు చేసి వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం ఎస్సీకేఎస్ సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రజా భవన్ లో కాంట్రాక్ట్ కార్మికులు ఆందోళన నిర్వహించారు. రూ.4900 కోట్ల రూపాయల నికర లాభాలను ప్రకటించిన సింగరేణి సమస్త ఆ లాభాలకు కారణమైన కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచకుండా దోపిడీకి పాల్పడుతుందని ఎస్సీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. మధు ఆరోపించారు. 2023లో జరిగిన సమ్మె సందర్భంగా సింగరేణి యాజమాన్యం కార్మిక శాఖ ఆధ్వర్యంలో యూనియన్ల మధ్య జరిగిన ఒప్పందాన్ని సైతం యాజమాన్యం అమలు చేయడం లేదని విమర్శించారు. జీఓ నెంబర్ 22 అమలు చేయడం కోసం అనుమతించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి సింగరేణి యాజమాన్యం 2022 సెప్టెంబర్ 29న లేఖ రాసిందని దానికి ఇప్పటివరకు ప్రభుత్వం సమాధానం చెప్పలేదన్నారు. కార్మికుల వేతనాలు పెంచడానికి ఎందుకు అనుమతించడం లేదో ప్రభుత్వం, విద్యుత్ శాఖ మంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ అమలు చేయటానికి యాజమాన్యం చెల్లించాల్సిన డబ్బులు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. నర్సరీ వర్కర్లకు సీఎంపీఎఫ్, ఈఎస్ఐ కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు తెలుసుకున్న ప్రజా పాలన నోడల్ ఆఫీసర్ దివ్య దేవరాజ్, ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి చెన్నారెడ్డి సింగరేణి లైజాన్ ఆఫీసర్‌ను ప్రజా భవనకు పిలిపించి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై చర్చించారు. వారం రోజుల్లోపు సింగరేణి యాజమాన్యంతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయించి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై చర్చించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం ఎస్సీకేఎస్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు దూలం శ్రీనివాస్, నాయకులు డి.వీరన్న, మహేందర్, రాజన్న, రాజేష్, రాజేశ్వరి పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలో జరుగుతున్న గంజాయి బెల్టు వ్యభిచార గృహాలు, అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టీకానంద్, కార్తీక్ డిమాండ్ చేశారు. మంగళవారం సీఐ బుద్దె రవీందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో కొంతమంది యువతను లక్ష్యంగా చేసుకొని గంజాయి దందా కొనసాగిస్తున్నారని, దీంతో యువత జీవితాలు ప్రమాదంలో పడిపోతున్నాయన్నారు. పట్టణంలో విచ్చలవిడిగా బెల్టు షాపులు కొనసాగుతున్నాయని దీనితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతర్గతంగా వ్యభిచార గృహాలను కొంతమంది కొనసాగిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంపై దృష్టి సారించాలి

- ఎంపీడీఓ అంజత్ పాషా



నవతెలంగాణ-కెరమెరి

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ అంజత్ పాషా అన్నారు. మంగళవారం మండలంలోని బాబేఝరి ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. పాఠశాలు స్టోర్ రూంలోని నిల్వ ఉన్న వంట సామాగ్రిని పరిశీలంచారు. ఉపాధ్యాయ, విద్యార్థుల హాజరు పట్టికలు, భోజన మెనూ వివరాలు, ఇతర రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం పాఠశాల సిబ్బందికి పలు సూచనలు చేశారు. వంట పాత్రల పరిశుభ్రతను పాటించాలన్నారు. వంటకు తాజా కూరగాయలను ఉపయోగించాలన్నారు. బాబేఝరి జీపి కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించి, గ్రామ పంచాయతీ అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి జాడే పెంటు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

జైనూర్ ఘటన నిందితుడిపై పీడీ యాక్ట్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో సంచలనం సృష్టించిన జైనూర్ మండలంలో జరిగిన ఆదివాసీ మహిళపై లైంగినదాడి ఘటనలో నిందితుడు షేక్ మగ్దూంపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్టు జిల్లా ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు 31న ఆదివాసీ మహిళపై లైంగికదాడి, హత్యాయత్నానికి పాల్పడిన షేక్ మగ్దూం అనే వ్యక్తిపై పీడీ యాక్ట్ అమలు చేసేందుకు చేసిన ప్రతిపాదనను ప్రభుత్వం ఏర్పాటు చేసిన పీడీ యాక్ట్ అడ్వైజరీ బోర్డు సభ్యుల ఆమోదంతో నవంబర్ 29న ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, దీనిపై ప్రభుత్వం పీడీ యాక్ట్ అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు ఒక ప్రకటనలో తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
బుధవారం | డిసెంబర్ 11, 2024 | www.navatelangana.com

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-జన్నారం

మండలం కామన్‌పల్లి గ్రామానికి చెందిన నిరుపేద గల్ఫ్ కుటుంబనికి చెందిన కామెర దుర్గయ్య అనే కార్మికుడు అనారోగ్యంతో ఇటీవలే మరణించాడు. విషయం తెలుసుకున్న కామన్‌పల్లి గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో విరాళాలు సేకరించి రూ.4000 మంగళవారం వారి కుటుంబానికి అందించేశారు. ఈ కార్యక్రమంలో కామనపల్లి గల్ఫ్ కార్మికుల వ్యవస్థాపకులు జునుగురు నాగరాజు, జునుగూరు వెంకటేష్, జాడి కిరణ్, పసుల రాజన్న, కోడిజుట్టు రాజేష్, కేతానవేణి చిలుకలయ్య, జనుగూరు రామన్న, కామేర దుర్గయ్య, కొడిజుట్టు సురేష్ పాల్గొన్నారు.

చోరీ కేసులో దొంగ అరెస్ట్

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని గట్రావ్‌పల్లి సాలేగూడలో జరిగిన చోరీ కేసులో మడావి జంగు అనే దొంగను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. ఈ నెల 8వ తేదీన సాలేగూడలో సిడా పాండు పని నిమిత్తం ఇంటికి తాళం వేసి తిర్యాణికి వెళ్లాడు. ఇది గమనించిన ఆదే గ్రామానికి చెందిన మడావి జంగు ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న 6.5 గ్రాముల బంగారు ఆభరణాలు, 35 గ్రాముల వెండి కడియాలు దొంగతనం చేశాడు. వాటి విలువ రూ.49000 ఉంటుందన్నారు. దొంగలించిన ఆభరాణాలను తన ఇంట్లో దాచి ఉంచి సమయం చూసుకొని మంగళవారం ఉదయం దొంగ సొత్తును అమ్మేందుకు మంచిర్యాల వెళ్లేందుకు దేవాపూర్‌లోని ఆంజనేయల స్వామి గుడి వద్ద బస్ కోసం ఎదురు చూస్తుండగా పోలీసులు అతని ప్రవర్తన అనుమానస్పందంగా కనిపించడంతో విచారించారు. విచారణలో అతను చేసిన దొంగతనాన్ని అంగీకరించడంతో జంగును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరళించినట్లు వివరించారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని బాలికల ఆశ్రమ పాఠశాలను ఏసీఎంఓ రాజమౌళి మంగళవారం రోజు కస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులతో 'మిషన్ లక్ష్యం' అమలు కార్యక్రమం గురించి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులందరితో సమావేశం నిర్వహించి వెనుకబడిన విద్యార్థులకు గుర్తించి ప్రత్యేక శ్రద్ధ చూపాలని, విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకొని బోధించాలని అన్నారు. ప్రత్యేక తరగతులలో వెనుకబడిన విద్యార్థులకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు బండ. జీవరత్నం పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలి

- బెల్లంపల్లి ఆర్డీఓ హరికృష్ణ



నవతెలంగాణ-తాండూర్

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని బెల్లంపల్లి ఆర్డీఓ హరికృష్ణ తెలిపారు. మంగళవారం తాండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడల వల్ల మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ఆరోగ్యం శారీరక దారుఢ్యం కలుగుతుందని తెలిపారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులకు భవిష్యత్తులో ఉన్నతమైన అవకాశాలు లభిస్తాయనన్నారు. ప్రభుత్వం క్రీడాకారులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. శారీరక దారుఢ్యం విద్యార్థులు పోలీస్, నేవి రక్షణ దళాల్లో ఉద్యోగాలు పొందవచ్చునని తెలిపారు. విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా శ్రద్ధతో చదివి ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కటకం అంజయ్య, తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంఈఓ ఎస్ మల్లేశం, ఎంపీఓ అనిల్ కుమార్, తాండూర్ ఎస్ఐ కిరణ్ కుమార్, మాదారం ఎస్ఐ సౌజన్య, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఎంఈఓ మల్లేశం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఈసా, సీనియర్ నాయకులు గట్టు మురళీధర్ రావు, సల్వాజి ఉమారాణి పాల్గొన్నారు..

రైతులెవరు అధైర్య పడొద్దు

- పొనకల్ పీఏసీఎస్ చైర్మన్ అల్లం రవి

నవతెలంగాణ-జన్నారం

వరి ధాన్యం తడిచిన రైతులెవరు అధైర్య పడవద్దని ఎమ్మెల్యేతో మాట్లాడి తగిన న్యాయం చేస్తామని పోన్కల్ పీఏసీఎస్ చైర్మన్ అల్లం రవి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో నిర్వహించిన పత్రిక విలేకరులతో మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యం వల్ల అకాల వర్షాలు కురిసాయని దీంతో రైతులకు తీవ్ర నష్టమే జరిగిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రైతులకు ఏమి చేయకుండా ఇప్పుడు నాయకుల వచ్చి రైతులతో కల్లబొల్లి మాటలు మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ అంటేనే రైతుల పార్టీ, కడెం మరమ్మత్తులు చేసి సాగునీటి సమస్య పరిష్కారం చేశామన్నారు. ప్రజా ప్రభుత్వంపై బురుద జల్లాలని చూస్తే ఊరుకోమని హెచ్చరించారు.

విదేశాలలో పని చేసేందుకు అవకాశం

నవతెలంగాణ-నస్పూర్

తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్పవర్ కంపెనీ లిమిటెడ్ (టీఓఎంసీఓఎం), తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ క్రింద ఒక రిజిస్టర్డ్ రిక్రూట్మెంట్ ఏజెన్సీ-తెలంగాణ నుండి అర్హత, నైపుణ్యం కలిగిన, సెమీస్కిల్డ్ కార్మికులకు విదేశాలలో పని చేయుటకు అర్హత కలిగిన వారికి ఈ నెల 12న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఎన్రోల్మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎ.రవికష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దుబాయ్ (యూఏఈ)లో (డెలివరీ బాయ్స్), సెక్యూరిటీ గార్డ్ అధిక డిమాండ్ ఉందని, సురక్షితమైన, చట్టబద్ధమైన వలస మార్గాల ద్వారా రిక్రూట్మెంట్ చేయడం జరుగుతుందని తెలిపారు. బైక్ రైడర్ అభ్యర్థులు 21-40 వయస్సు కలిగి ఉండాలని, కనీసం ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణులై కనీసం 2 సంవత్సరాలు పూర్తి అయిన డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. సెక్యూరిటీ గార్డ్ అభ్యర్థులు కనీసం ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండి, కనిష్ట ఎత్తు 5 అడుగుల 8 అంగుళాలతో ఫ్లాట్ పొట్ట కలిగి 21-32 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలని, అభ్యర్థులు పాస్పోర్ట్ కలిగి ఉండాలని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ ప్రస్తుత రెస్యూమ్‌ను టీఓఎంసీఓఎం.రెస్యూమ్ జీమేయిల్‌కు పంపించాలని, వివరాలకు 9440051452, 9440049861, 9440050951 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆత్మహత్య చేసుకున్న ల్యాబ్ టెక్నీషియన్‌కు నివాళులు

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

తెలంగాణ డయాగ్నస్టిక్స్ అసోసియేషన్ నిర్మల్ జిల్లా ఆధ్వర్యంలో సీనియర్ ప్రభుత్వ అవుట్ సోర్సింగ్ ల్యాబ్ టెక్నీషియన్ వకులాభరణం భరత్ కుమార్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. చాలీచాలని వేతనంతో జీవితాన్ని సాగించలేక ఎప్పటికైనా ఉద్యోగం శాశ్వతమవుతుందన్న నమ్మకంతో పనిచేసి, ఇప్పటికీ ఉద్యోగం పర్మినెంట్ కాకపోవడంతో మనస్థాపం చెంది సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. అసోసియేషన్ సభ్యులు పూలమాలలు వేసి, మౌనం పాటించి నివాళులు ఘటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేరెళ్ల హనుమంతు, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు తిప్రిస్ సంతోష్ కుమార్, పట్టణాధ్యక్షులు ప్రకాష్, సభ్యులు రమేష్, గంగాధర్, తిరునగరి సంపత్ పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల ముందస్తు అరెస్టు



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఆశా కార్యకర్తలను ఎస్ఐ రాజ వర్ధన్ మంగళవారం ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషను తరలించారు. ఆశా కార్యకర్తల జిల్లా ఉపాధ్యక్షురాలు తొగరి లీలా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఆ సమస్యపై సోమవారం హైదరాబాద్ వచ్చిన తర్వాత ఎవరి ఇండ్లలో వాళ్ళు ఉండగా కూడా తమను పోలీసులు అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు మండల వైస్ ప్రెసిడెంట్ మంజుల, శైలజ కవిత, కళావతి ఉన్నారు.

నస్పూర్ : ఆశాల సమస్యలు పరిష్కరించాలని శాంతియుతంగా హైదరాబాద్‌లో ధర్నా చేయడాన్ని ప్రభుత్వం పట్టించుకోకుండా, అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బిఆర్టీయూ జిల్లా అధ్యక్షురాలు ఆకుల వాణి తెలిపారు. మంగళవారం నస్పూర్ పీహెచ్సీలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ. 18 వేల వేతనాన్ని ఇవ్వాలన్నారు. ఆశాలను అరెస్టు చేయకుండా వారి సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశాలు సంధ్యారాణి, పద్మ పాల్గొన్నారు.



నస్పూర్‌లో..

కార్మికుల సంక్షేమమే సింగరేణి లక్ష్యం



నవతెలంగాణ-నస్పూర్

కార్మికుల సంక్షేమమే సింగరేణి లక్ష్యమని, వారికి మౌలిక సదుపాయాలు అందించడంలో ముందుంటుందని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సూర్యనారాయణ అన్నారు. మంగళవారం ఆర్కే-8 డిస్పెన్సరీలో సుమారు రూ.20 లక్షల వ్యయం గల నూతన రెండు అంబులెన్స్‌లను జీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన అధునాతన అంబులెన్స్‌లను ప్రారంభించడం చాలా సంతోషకరమైన విషయం అని తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలోని వివిధ గనులు విభాగాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు, అధికారులకు అనుకోని సంఘటనలు జరిగినప్పుడు వారిని తక్షణ, మెరుగైన వైద్య సదుపాయం కోసం ఏరియా హాస్పిటల్, ప్రయివేటు ఆసుపత్రులకు తీసుకువెళ్లడానికి ఈ అంబులెన్సులు ఉపయోగపడతాయని, ఈ అంబులెన్స్‌లలో ఆక్సిజన్ సిలిండర్, ప్రథమ చికిత్స సదుపాయం, స్ట్రెచ్చర్ తదితర వైద్య సదుపాయాలను సమకూర్చడం జరిగిందని, ఈ అంబులెన్స్‌లు ఆర్కే-8 డిస్పెన్సరీ, నస్పూర్ డిస్పెన్సరీలలో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీవై సీఎంఓ డాక్టర్ పి రమేష్ బాబు, డీజీఎంలు పి అరవింద రావు, చిరంజీవులు, ఆనంద్ కుమార్, పర్సోజ్ అధికారి చంద్రశేఖర్, డాక్టర్ వేదవ్యాసు పాల్గొన్నారు.

ఘనంగా సేవా సమితి ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి సేవ సమితి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం శ్రీరాంపూర్‌లోని ప్రగతి స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యమానికి డీజీఎం పర్సనల్ పి అరవింద రావు అధ్యక్షత వహించగా సేవ అధ్యక్షురాలు మాలతి కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సేవా సమితి 2000 డిసెంబర్ 10న ఆవిర్భవించడం జరిగిందని, దీని ద్వారా సింగరేణి వ్యాప్తంగా అనేక మంది యువతీ-యువకులకు టైలరింగ్, మగ్గం, బ్యూటీషియన్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మోటార్ డ్రైవింగ్, హెవీ డ్రైవింగ్, వోల్వా డ్రైవింగ్ కోర్సులలో శిక్షణ ఇచ్చి వారి కుటుంబానికి కావలసిన ప్రోత్సాహకాన్ని అందిస్తుందని తెలిపారు. సింగరేణి సేవా సమితి ద్వారా శ్రీరాంపూర్ ఏరియాలో ఇప్పటి వరకు అనేక మంది యువతీ, యువకులు స్వయం ఉపాధి సాధించడం జరిగిందన్నారు. అలాగే 2023-24 ఆర్థిక సంవత్సరంలో వివిధ వృత్తి శిక్షణ కోర్సులు నేర్చుకున్న మహిళలకు సర్టిఫికెట్లను అందించారు. ఈ సంవత్సరం ఇప్పటి వరకు నడుస్తున్న కోర్సులకు అదనంగా బ్యూటీషియన్, టైలరింగ్ కోర్సులను సేవ అధ్యక్షురాలు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం శ్రీరాంపూర్ ఏరియా బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, సీనియర్ పీఓపీ కాంతారావు, సేవ సెక్రటరీ కొట్టే జ్యోతి, శిరీష, రజిత, మల్లీశ్వరి పాల్గొన్నారు.



తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం



నవతెలంగాణ-జన్నారం

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ తల్లి విగ్రహం రాజకీయానికి నిరసనగా నిన్న భారత రాష్ట్ర సమితి శాంతియుత నిరసన కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చిన నేపథ్యంలో మంగళవారం మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పార్టీ నాయకులు పాలాభిషేకం చేశారు. సందర్భంగా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బాలసాని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ విగ్రహాన్ని మార్చి పూటకో మాట్లాడుతున్నాడు అన్నారు. ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని అవమానపరిచి కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అవివేకం అన్నారు. తెలంగాణ ప్రజలు దీన్ని గ్రహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు, బాలసాని శ్రీనివాస్‌గౌడ్ మండల ప్రధాన కార్యదర్శి సులువ జనార్ధన్, మాజీ కోఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీ ఖాన్, జిల్లా నాయకులు భరత్ కుమార్, యూత్ అధ్యక్షుడు పేరం శ్రీనివాస్, జాడి గంగాధర్, మల్లయ్య సంతోష్, నర్సగౌడ్ ఫజల్ ఖాన్, కేవ నరసింహులు, కడార్ల నర్సయ్య, లక్ష్మీనారాయణ, రాగుల శంకర్, రాములు నాయక్, లక్ష్మణ్, నరేష్, సాయి, సత్యనారాయణ, లెక్కల మల్లయ్య పాల్గొన్నారు.

13,14న కవ్వాల్‌లో బర్డ్ వాక్

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కవ్వాల్ అభయారణ్యంలో ఈ నెల 13, 14న బర్డ్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని జన్నారం ఇన్‌చార్జి ఎఫ్ఆర్ఓ సుష్మారావు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే డిసెంబర్ 13, 14 తేదీల్లో బైసన్ కుంట, బర్తనపేట్ బేస్ క్యాంపుల వద్ద బర్డ్ వాక్ నిర్వహిస్తున్నామన్నారు. పర్యాటకులు అరుదైన పక్షులు, మొక్కలను వీక్షించే అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు రూ.2000 ఫీజు చెల్లించి కార్యక్రమంలో పాల్గొనవచ్చని సూచించారు. పక్షి ప్రేమికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వచ్చిన పక్షి ప్రేమికులకు ఉదయం టిఫిన్ మధ్యాహ్నం భోజనం తాము ఏర్పాటు చేస్తామన్నారు.

చిన్నారి అక్షరశ్రీ ప్రతిభ అమోఘం

- 22 సెకండ్లలో 28 రాష్ట్ర రాజధానిల పేర్లు
- 26 సెకండ్లలో 60 తెలుగు సంవత్సరాలు

నవతెలంగాణ-జన్నారం



మండల కేంద్రంకు చెందిన ఐదవ తరగతి చదువుతున్న తొమ్మిదేండ్ల చిన్నారి అక్షరశ్రీ కేవలం 22 సెకండ్లలోనే దేశంలోని 28 రాష్ట్రాల రాజధానుల పేర్లను చెబుతూ పలువురి మన్ననలు అందుకుంటోంది. 26 సెకండ్లలో 60 తెలుగు సంవత్సరాల పేర్లను గల గల చెప్పేస్తుంది. మండల కేంద్రంలోని శ్రీకృష్ణవేణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ 05 వతరగతి చదవుతున్న అక్షరశ్రీ 07 సంవత్సరాల వయస్సు నుండే భగవద్గీతలోని శ్లోకాలను చదువుతుందని అక్షరశ్రీ తల్లి దండ్రులు కస్తూరి సంగీత, సతీశ్‌లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం జనరల్ నాలెడ్జ్ పుస్తకాలతో పాటు హనుమన్ చాలీసాలోని శ్లోకాలను చదువుతుందని అక్షరశ్రీ చదువుకునే స్కూల్ లోనే తాము ఇరువురం టీచర్లుగా పనిచేస్తున్నామని తెలిపారు. అక్షర చిన్నతనం నుంచి చదువులో చురుకుగా ఉంటుందని ఒకసారి చెప్తే ఇట్టే పట్టేసుకుని మళ్లీ తిరిగి చెప్తుంది.ఇంకా అతి తక్కువ సమయంలో రాష్ట్రాల పేర్లు చెప్పించి గిన్నిస్ బుక్ ఎక్కాలన్నదే తమ అభిమాతమని వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇంత చిన్నతనంలో చిన్నారి తెలివితేటలను చూసి పలువురు అభినందించారు.

14న లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-దండేపల్లి

ఈ నెల 14న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని దండేపల్లి ఎస్ఐ ఉదయ్ కిరణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజీపడదగిన అన్ని క్రిమినల్, సివిల్ కేసులు, బ్యాంకు కేసులు, కుటుంబ వివాదాలు, చెక్‌బౌన్స్ కేసులను లోక్ అదాలత్‌లో సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవచ్చన్నారు. లోక్ అదాలత్ లో రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కారం చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకొని కోర్టులు చుట్టు తిరుగుతూ విలువైన సమయాన్ని డబ్బును వృథా చేసుకోవద్దని అన్నారు. న్యాయ వ్యవస్థ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కేసులు రాజీ పడదలచిన వాళ్ళని కోర్టు విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడే అవకాశం కల్పిస్తారని తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుంది కాబట్టి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

హామీలు అమలు చేయాలని అంబేద్కర్ విగ్రహానికి వినతి



నవతెలంగాణ-నస్పూర్

బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మంగళవారం సీసీసీ కార్నర్ లోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా కామరెడ్డి జిల్లాలో జరిగిన బీసీ డిక్లరేషన్ సభలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేస్తామని చెప్పి అధికారం చేపట్టి సంవత్సరకాలం పూర్తయిన బీసీ సబ్ ప్లాన్‌పై ఎలాంటి కార్యచరణ చేపట్టకపోవడం అంటే ఇది బీసీలను మభ్య పెట్టడమే అవుతుందన్నారు. బీసీ ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను విస్మరించడం బాధాకరమని, అసెంబ్లీ సమావేశాలలో బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటుపై చర్చించి ప్రభుత్వం ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి అక్కల రమేష్, బీసీ సీనియర్ నాయకులు భీమ్సన్, మాదన బోయిన రాజన్న యాదవ్, వంశీ, షేక్ సల్మాన్, ఆకుల రాజు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో కుటుంబం ఆత్మహత్య యత్నం

నవతెలంగాణ-తాండూర్

అత్యాశకు పోయి షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టిన ఆ యువకుని కుటుంబం అదోగతి పాలయింది. చేసిన అప్పులు తీర్చలేక సమాజంలో తలెత్తుకోలేక తల్లి, తండ్రి, చెల్లెలు కుటుంబ సభ్యులు నలుగురు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలం కాసిపేట గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. సముద్రాల మొండయ్య(60), భార్య శ్రీదేవి(50), కూతురు(చిట్టి), చైతన్య(30), కుమారుడు శివ ప్రసాద్(26) నలుగురు ఆత్మహత్య ప్రయత్నం చేసుకున్నారు. కుటుంబ సభ్యులంత కలిసి శీతల పానీయంలో గడ్డి మందును కలుపుకొని తాగారు. ఇంట్లో నుండి అరుపులు వినబడడంతో స్థానికులు ప్రాణాపాయ స్థితిలో ఉన్న నలుగురిని 108 అంబులెన్స్‌లో బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి మంచిర్యాల ఆ తర్వాత వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. గతంలో శివ ప్రసాద్ పలువురి వద్ద అప్పులు చేసి ఆన్‌లైన్ షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టగా నష్టం వాటిల్లింది. అప్పులు ఇచ్చిన వారు చెలించాలని ఒత్తిడి చేయడంతో కుటుంబం మొత్తం పురుగుల మందు తాగినట్లు తెలుస్తుంది.

సర్వీస్ రోడ్డు కోసం గ్రామస్తుల ఆందోళన

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

సోన్ మండలం కడ్తాల్ గ్రామంలో సర్వీస్ రోడ్డు కోసం గ్రామస్తులు మంగళవారం ఆందోళన చేపట్టారు. 44వ జాతీయ రహదారి వెడల్పులో భాగంగా గ్రామంలో ఫ్లై ఓవర్ నిర్మించారని, దీంతో సర్వీస్ రోడ్డు లేకుండా రహదారిని ఏర్పాటు చేశారని వాపోయారు. గతంలో ఉన్న సర్వీస్ రోడ్డును రహదారిలో కలపడం వల్ల గ్రామస్తులకు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి, చర్యలు తీసుకోవాలన్నారు.

నవతెలంగాణ

5

ఆదిలాబాద్

బుధవారం | డిసెంబర్ 11, 2024 | www.navatelangana.com

కాపర్‌ను పట్టుకున్న సింగరేణి ఎస్‌అండ్‌పీసీ

నవతెలంగాణ-రెబ్బెన



చోరీకి గురై స్క్రాబ్ దుకాణానికి చేరుకున్న సింగరేణికి చెందిన కాపర్, ఇనుప సామాగ్రిని సింగరేణి ఎస్ అండ్ పీసీ సిబ్బంది మంగళవారం పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ ఉమాకాంత్ ఆధ్వర్యంలో సిబ్బంది మంచిర్యాల జిల్లా బోయపల్లిలోని స్క్రాబ్ దుకాణాన్ని తనిఖీ చేశారు. ఇక్కడ నిల్వ ఉంచిన 170 కిలోల కేబుల్ నుంచి తొలగించిన కాపర్ తీగ, 5 క్వింటాళ్ళ ఇనుప సామాగ్రిని రికవరీ చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ లక్ష ఉంటుందని అధికారులు తెలిపారు. తనిఖీల్లో జూనియర్ ఇన్స్‌పెక్టర్ చంద్రయ్య, శంకర్, వెంకటేష్, మల్లేష్ పాల్గొన్నారు.

కరాటేలో ప్రతిభ చాటిన ఎంజేపీ విద్యార్థినులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినులు కరాటే పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచారు. కాగజ్‌నగర్‌లో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి కరాటే పోటీల్లో సైదం శైలజ, అక్షయ, మేఘనలు గోల్డ్ మెడల్ సాధించగా అంజలి, తేజరాణి, రచనశ్రీ, ప్రశంస, నందిని, అభినయ, సిల్వర్ పథకాలను సాధించారు. కరాటే క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను పాఠశాల ప్రిన్సిపాల్ రత్న బాయి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

విధులకు గైర్హాజరు కావొద్దు : జీఎం



నవతెలంగాణ-రెబ్బెన

విధులకు గైర్హాజరు కాకుండా ఉద్యోగంలో గుర్తింపు తెచ్చుకోవాలని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జీఎం కార్యాలయ ఆవరణలో మెడికల్ ఇన్వాలిడేట్ అయిన ఉద్యోగుల ఏడుగురు వారసులకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సింగరేణిలో ఉద్యోగం దొరకడం అదృష్టమని, కొత్తగా ఉద్యోగంలో చేరే యువతీ, యువకులు నిబద్ధతతో పనిచేసి సంస్థ, కుటుంబ ఎదుగుదలకు కృషి చేయాలన్నారు. విధులకు గైర్హాజరు కాకుండా అధికారుల సూచనలు ఆదేశాల మేరకు విధులు నిర్వర్తించి ఉత్తమ ఉద్యోగులుగా పేరు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం కె.రాజమల్లు, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ 6 గ్యారెంటీలు 66 అబద్ధాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



గడిచిన సంవత్సర కాలంలో కాంగ్రెస్ పాలన 6 గ్యారంటీలు 66 అబద్ధాలుగా తయారైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి శ్రీనివాస్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పార్టీ కార్యాలయం నుండి నిర్వహించిన బైక్ ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించారు. ప్రధాన రహదారుల గుండా సాగిన ర్యాలీ వడ్డెపల్లి గార్డెన్‌కు చేరుకుంది. ఇక్కడ ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ సంవత్సర పాలనలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు అధ్వానంగా ఉందన్నారు. సంవత్సర పాలనలో ప్రజల నుండి వ్యతిరేకత మూట కట్టుకున్నదని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ మల్లికార్జున్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు విశాల్, నియోజకవర్గ ఇన్‌చార్జి కొట్నాక విజయ్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు జయరాజ్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేసరి ఆంజనేయులు గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీడీఓ అల్బర్ట్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రతను పాటించాలని, నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు యాదగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

19న జిల్లా ఆర్యవైశ్య ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-బెజ్జూర్



కాగజ్‌నగర్ పట్టణంలో ఈనెల 19న జిల్లా ఆర్యవైశ్యుల మహాసభలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఆర్యవైశ్య సంఘం యూత్ అధ్యక్షులు పుల్లూరు సతీష్ తెలిపారు. బెజ్జూరు మండల కేంద్రంలో మంగళవారం రంగనాయక దేవాలయ ప్రాంగణంలో ఆర్యవైశ్య మహాసభల ఆహ్వాన పత్రిక ఆవిష్కరించారు. జిల్లా ఆర్యవైశ్య మహాసభల ప్రమాణస్వీకారం జిల్లాలోని ఆర్యవైశ్య సంఘం సభ్యులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు రాచకొండ చంద్రశేఖర్, రంగనాయక ఆలయ కమిటీ అధ్యక్షులు మహేష్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు బోగ రమేష్, మిరియాల వెంకటరమణ, నేరెళ్ల సంతోష్, పెంటయ్య, రాచకొండ నాగేష్, మహేందర్, సంతోష్, శంకరయ్య కిరణ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని కసాబ్ వాడిలో గల పోచమ్మ టెంపుల్ వద్ద ఉన్న ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని దానిని రక్షించాలని కాలనీ వాసులు మున్సిపాలిటీలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో నుండి ప్రహరీ గోడ నిర్మించారని దానిని వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో కాలనీవాసులు అన్నాజీ, ఉమేందర్, గంగయ్య, నాగేష్, స్వాతి, గణేష్ ఉన్నారు.

ఏఎన్ఎంల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు పది నెలల నుండి పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని హైదరాబాద్‌లోని ప్రజాభవన్ ఎదుట నిర్వహించిన నిరసనలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌తో పాటు జిల్లా ఏఎన్ఎంలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజా భవన్ ప్రత్యేక అధికారి దివ్య దేవరాజన్ స్పందించినట్లు తెలిపారు. ఈ ధర్నాలో ఆశ్రమ పాఠశాల ఏఎన్ఎం జిల్లా అధ్యక్షురాలు మహేశ్వరి, జిల్లా కోశాధికారి సునీత, జిల్లా నాయకులు శ్రీదేవి, మీరాబాయి, రమ పాల్గొన్నారు.



తలరాతలు మార్చలి కానీ విగ్రహాలు కాదు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వాలు మారినప్పుడల్లా ప్రజల తలరాతలు మారాలి తప్ప తల్లుల విగ్రహాలు కాదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలు మార్చి ఆవిష్కరించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పిలుపు మేరకు మంగళవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పాత తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ నాలుగున్నర కోట్ల ప్రజల ఆకాంక్ష మేరకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యమించి, ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారన్నారు. బీఆర్ఎస్ హయంలో సంస్కృతి ఉట్టిపడేలా రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని తయారు చేశారన్నారు. తెలంగాణ సంస్కృతి ఆనవాళ్ళ లేకుండా తెలంగాణ తల్లి విగ్రహాన్ని కాంగ్రెస్ ఏర్పాటు చేసిందన్నారు. ఏదైన మంచి కార్యక్రమం చేపట్టే ముందు కూడి కాలు పెడుతామని, కానీ కాంగ్రెస్ రూపొందించిన తెలంగాణ తల్లి ఎడమ కాలు పెడుతోందన్నారు. తెలంగాణ సంస్కృతి, కేసీఆర్ ఆనవాలు లేకుండా బీజేపీతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. అందులో భాగమే తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చారన్నారు. స్థానిక ఎమ్మెల్యే కూడా ఈ విషయంపై మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అజయ్, సాజిదొద్దిన్, యూనీస్ అక్బానీ, గోవర్ధన్, గంద్రత్ రమేష్, అశోక్, రోకండ్ల రమేష్, జగదీష్, రాజన్న, పరమేశ్వర్, ప్రహ్లాద్, నారాయణ, స్వరూప, పర్వీన్, కరుణ పాల్గొన్నారు.

తలమడుగు : సుంకిడి గ్రామంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నెలకొల్పిన తెలంగాణ తల్లి పాత విగ్రహానికి మంగళవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం నెలకొల్పిన తెలంగాణ తల్లి పాత విగ్రహాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని కించపరిచే విధంగా నూతన విగ్రహాన్ని రూపొందించారని ఆరోపించారు. తెలంగాణ తల్లి విగ్రహం కాకుండా కాంగ్రెస్ తల్లి విగ్రహంగా రూపొందించారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు తోట వెంకటేష్, కిరణ్ కుమార్, ముడుపు కేదారేశ్వర రెడ్డి, ఆశన్న యాదవ్, వామన్, మహేష్ దేశ్‌ముఖ్, రాంబాయి, సునీత రెడ్డి, ఆనంద్, రమాకాంత్ పాల్గొన్నారు.

ఉట్నూర్ : కాంగ్రెస్ ప్రభుత్వం పాత తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చడం సరికాదని మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పంద్రా జైవంత రావ్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిరసన తెలిపి, తెలంగాణ తల్లి విగ్రహాన్ని పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్, నాయకురాలు రాథోడ్ చారులత, పెందూర్ ప్రభాకర్, ధరణి రాజేష్, సలీం, కటం రమేష్, సీతారామ్ పాల్గొన్నారు.

లోకేశ్వరం : మండలంలోని ప్రయాణ ప్రాంగణం కూడలిలో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిని కనుమరుగు చేసేల కాంగ్రెస్ వ్యవహరిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గంగాధర్, సాయినాథ్, కిషన్, రాజు, పోశెట్టి, భోజన్న, రాజు, సాయన్న, రైతులు పాల్గొన్నారు.

13 లోపు అభ్యంతరాలు తెలపాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 13లోగా గ్రామపంచాయతీ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలను తెలియజేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. ఆసిఫాబాద్ ఆర్డీఓ లోకేశ్వర్ రావు, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్‌తో కలిసి గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలపై అధికారులు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే 2వ గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో 335 గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలో మొత్తం గ్రామపంచాయతీ వార్డులు 2,874 ఉన్నాయని, వార్డుల ఎన్నికలకు సరిపడా సిబ్బంది వివరాలు సేకరించడం జరిగిందని తెలిపారు. ముసాయిదా పోలింగ్ కేంద్రాల వివరాలను జిల్లాలో అన్ని గ్రామపంచాయతీలలో ఈ నెల 6న ప్రచురించడం జరిగిందని, ఈ నెల 12న అన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారుల కార్యాలయాలలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు సూచనలు అందించాలన్నారు. పోలింగ్ కేంద్రాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే



ఈ నెల 13 వరకు రాతపూర్వకంగా తెలియజేయాలని, పోలింగ్ కేంద్రాలలో అదే రోజున ఎన్నికల అనంతరం కౌంటింగ్ ఉంటుందని, సరైన వెలుతురు ఉండేలా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి : అదనపు కలెక్టర్



నవతెలంగాణ-కౌటాల

వడ్ల కొనుగోలు కేంద్రాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అడిషనల్ కలెక్టర్ డేవిడ్ అన్నారు. మంగళవారం మండలంలోని సాండ్గాంలో ఐకేపీ ద్వారా వడ్లు కొనుగోలు చేస్తున్న కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రమాణాలు పాటించకుంటే ప్రమాదంలో పడినట్లేనని అన్నారు. తేమ శాతం 17 శాతం మించకుండా చూసుకోవాలని, సన్న రకం వడ్లకు రూ. 500 అదనంగా బోనస్ పొందాలని రైతులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ఇందారపు పుష్పలత, ఏఈఓ సిద్ధు, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

పెంచికల్‌పేట్ : మండల కేంద్రంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్(రెవెన్యూ) డేవిడ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యాన్ని అమ్ముకోవాలని సూచించారు. ప్రభుత్వం అందించే బోనస్‌ను పొందాలని, వరి ధాన్యంలో తేమ లేకుండా చూసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ అల్బర్ట్, వ్యవసాయ శాఖ అధికారి మనీషా, ఏపీఎం కోనయ్య, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ల్యాండ్ రెగ్యులరేషన్ స్కీమ్ కింద వచ్చిన దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశం మందిరంలో మున్సిపాలిటీల పరిధిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి సంబంధిత అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాలలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల సమన్వయంతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి, అవసరమైన వివరాలను సేకరించాలని తెలిపారు. నిబంధనల ప్రకారం ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో నిర్మల్, ఖానాపూర్, భైంసాల మున్సిపల్ కమిషనర్లు ఖమర్ అహ్మద్, మనోహర్, రాజేష్ కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మల్టీ డిపార్ట్మెంట్ కమిటీ సమావేశం

నవతెలంగాణ-రెబ్బెన

జీఎం కార్యలయం కాన్ఫరెన్స్ హాల్‌లో మల్టీ డిపార్ట్మెంట్ కమిటీ అధికారులు సమావేశం నిర్వహించారు. గనులు, అన్ని విభాగాల అధికారులు, అధిపతులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన జీఎం ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ గతంలో సాధించిన లక్ష్యాలు, భవిష్యత్‌లో లక్ష్యాల సాధనకు పనితీరును వివరించారు. పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా సింగరేణి సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకత, ఉద్యోగులు, యంత్రాల పనితీరు గణాంకాలను వివరించారు. సంస్థ అభివృద్ధికి కోసం చేపట్టాల్సిన కార్యాచరణపై ఉద్యోగుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీఓ మచ్చగిరి నరేందర్, ఏరియా ఇంజినీర్ భీంరావ్ జాడే, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు

ప్రయివేట్ ఆస్పత్రిపై పబ్లిక్ హెల్త్ డైరెక్టర్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిని నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారని ఆ ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్‌రెడ్డి కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ పబ్లిక్ హెల్త్ డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆస్పత్రిలో డాక్టర్లు లేకపోయినా వివిధ డాక్టర్ల అర్హతతో తమ ఆస్పత్రిలో ఉన్నట్లుగా పర్మిషన్ తీసుకొని నడుపుతున్నరన్నారు. దీనికి స్పందించిన ఆయన వెంటనే ఎంక్వయిరీ చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

గుణాకార పట్టికలు చాలా ముఖ్యం

ఆదిలాబాద్ రూరల్ : గణిత సమస్యలు వేగంగా సాధించడానికి గుణకార పట్టికలు ఎంతగానో తోడ్పడుతాయని సెక్టోరల్ అధికారి నర్సయ్య విద్యార్థులకు సూచించారు. మంగళవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని బంగారుగూడ తెలుగు మీడియం ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, మధ్యాహ్నం భోజనం తయారు చేస్తున్న విధానం పరిశీలించారు. విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని అన్నారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లలకు శుభ్రమైన తాగునీరు అందించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

పిల్లలకు శుభ్రమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతోనే మంగళవారం ఉట్నూర్ పట్టణంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్ మెషిన్ అజయ్ పవార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగిందనీ ఫౌండేషన్ చైర్మెన్ అజయ్ పవార్ అన్నారు. ముఖ్య అతిథిగా సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మట్, ఐటీడీఏ ఈఈ రిటైర్డ్ ఉద్యోగి రాథోడ్ భీమ్‌రావులతో కలిసి వాటర్ ప్లాంట్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పవార్ కృష్ణ, కుమ్ర శ్రీనివాస్, జెడ్పీఎస్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాదవ్ రమేష్, ఆర్ఆర్ఆర్ ట్రస్ట్ చైర్మెన్ జాదవ్ రాజేష్, ఉపేందర్, రవీందర్, నిరూప్, జ్యోతి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ఉట్నూర్

పట్టణంలోని బోయవాడకు చెందిన గంజర్ల వెంకటేష్ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఉట్నూర్ మాజీ జెడ్పీటీసీ చారులత రాథోడ్ మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

12 నుంచి మండల స్థాయి పోటీలు

నార్నూర్ : ఈనెల 12 గురువారం నుంచి మండల స్థాయి సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ జవహర్‌లాల్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో పోటీలు నిర్వహించేందుకు క్రీడా మైదానాన్ని పరిశీలించారు. గ్రామపంచాయతీ పరిధిలో క్రీడా పోటీలు నిర్వహించిన అనంతరం మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనునట్లు పేర్కొన్నారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు ఈ విషయాన్ని గమనించాలని, మండల స్థాయి పోటీలో పాల్గొనేలా చూడాలని కోరారు. వారి వెంట పాఠశాలల పీడీ విశ్వనాథ్, కార్యదర్శి మోతీరాం ఉన్నారు.

పురుగులమందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

నవతెలంగాణ-కౌటాల



పురుగులమందు తాగి వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలోని కన్నెపెల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై ఎస్.మధుకర్ తెలిపిన వివరాల ప్రకారం టాకిరె బాబురావు (52) ఐదు రోజుల క్రితం తన కూతురు టాకిరే మానస ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోయింది. తన కూతురు ఏమైందో ఎక్కడ ఉందో అనే బాధతో మనస్థాపం చెంది మంగళవారం మధ్యాహ్నం ప్రాంతంలో ఇంట్లో ఉన్న పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడు టాకిరే వినోద్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

లేగ దూడపై పులి దాడి

నవతెలంగాణ-సిర్పూర్(టి)



మండలంలోని హుడికిలి గ్రామంలో బుధవారం ఉదయం గ్రామంలోకి చొరబడి ఊర్లో తిరిగింది. ఈక్రమంలో దాందిరే రావుజి అనే రైతు ఇంటి ఆవరణలో కట్టేసి ఉన్న లేగదూడ మెడపై తీవ్రంగా గాయం చేసింది. రైతు తెల్లవారుజామున చూడగా మెడపై పులి పంజ గుర్తులు గమనించి అటవీ శాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో ఎఫ్ఆర్ఓ ఇక్బాల్ హుస్సేన్ సంఘటన స్థలానికి చేరుకొని లేగదుడకు చికిత్స నిమిత్తం సిర్పూర్ పశు వైద్యశాలకు తరలించి చికిత్స చేయించి రైతుకు అప్పగించారు. తెలిపారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ మాట్లాడుతూ అటవీ తీర ప్రాంత గ్రామ ప్రజలు రాత్రి సమయాలలో బయట తిరగవద్దని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పులి సంచరిస్తున్న నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలన్నారు.

రక్తదానం వల్ల అనేక ప్రయోజనాలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

రక్తదానం వల్ల అనేక ప్రయోజనాలున్నాయని, వాటి గురించి తెలియక చాలా మంది అపోహలో ఉన్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డా.కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని రాజస్థాన్ భవన్‌లో మార్వాడి యువ మంచ్ కాగజ్‌నగర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీవన్ ధర సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. దురదృష్టవశాత్తు, అనారోగ్యం, ప్రాణాంతక ప్రమాదాల కారణంగా ప్రతిరోజూ వేలాది మందికి రక్తం అవసరమవుతుందన్నారు. రక్త బ్యాంకులు ఎల్లప్పుడూ అవసరమైన మొత్తాన్ని పూర్తి చేయలేవని తెలిపారు. స్వచ్ఛందంగా రక్తదానికి యువత ముందుకు వస్తే రక్తం కొరత తీరుతుందన్నారు. కార్యక్రమంలో మార్వాడి యువమోర్చా అధ్యక్షులు అరుణ్ లోయ, గిరాధరలాల్ ముందడ, సెక్రటరీ అభిషేక్ అసవా, ట్రెజరర్ శుభం లోయ, మురళి, జావార్ కపిల్, సోని, రిషబ్ రైన్, అశోక్ లోయ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ రంగస్వామి, శివగౌడ్, మార్వాడి యువమోర్చా మాజీ అధ్యక్షులు రాజేష్ రఘు పాల్గొన్నారు.

ఏసీ బస్సుల టికెట్లపై 10 శాతం సబ్సిడీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అన్ని ఏసీ బస్సుల బేసిక్ టికెట్ చార్జ్‌పై 10 శాతం సబ్సిడీని ప్రకటించిందని, ఈ సదుపాయం ఏసీ స్లీపర్, ఏసీ సీటర్‌తో పాటు రాజధాని బస్సులకు 2024 డిసెంబర్ 6వ తేదీ నుండి అమలులోకి వచ్చిందని ఆసిఫాబాద్ డిపో మేనేజర్ విశ్వనాథ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు ఉన్నత స్థాయి ప్రయాణాన్ని మరింత అందుబాటులో ఉంచడం సౌకర్యవంతంగా చేయడం లక్ష్యంగా ఈ ఆఫర్ ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ప్రయాణికులు ఈ ఆఫర్‌ను ఉపయోగించి పది శాతం తగ్గింపు టికెట్ చార్జితో సౌకర్యవంతమైన ప్రయాణం చేయాలని కోరారు. ఈ తగ్గింపు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఏసీ బస్సుల ద్వారా అందుబాటులో ఉన్న అన్ని రూట్లో వర్తిస్తుందని తెలిపారు.

రామాలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని జనకాపూర్ కోదండ రామాలయంలో కలెక్టర్ వెంకటేష్ ధోత్రే దంపతులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు సంతోష్, శేఖర్ శర్మ, వినాయక శర్మలు వారిరువురిని ఘనంగా సన్మానించారు. పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు సత్యనారాయణ, కార్యదర్శి సీహెచ్ రవి, గౌరవ అధ్యక్షులు డాక్టర్ రమేష్ రూప్నర్, కమిటీ సభ్యులు పత్రే గిరి, గాజర్ల శైలేందర్, చిప్ప మహేష్, లక్ష్మీ, బీసీ సంఘం రైతు అధ్యక్షుడు మారుతి పటేల్ పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

నవతెలంగాణ-తలమడుగు

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని శిక్షణ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవీయ అన్నారు. మంగళవారం మండలంలోని భరంపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో సీఎం కప్ మండల స్థాయి క్రీడలను శిక్షణ కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి పాల్గొన్న శిక్షణ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడా నైపుణ్యాలను పెంచుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. కాగా క్రీడాకారులకు గ్రామస్తుడు ముడుపు కేదారేశ్వర్‌రెడ్డి బోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, బీసీసీబీ మాజీ చైర్మెన్ ముడుపు దామోదర్‌రెడ్డి, జిల్లా క్రీడలాధికారి పార్థసారథి, తహసీల్దార్ రాజ్‌మోహన్, ఎంపీడీఓ శేఖర్, మండల ప్రత్యేకాధికారి గజానన్, ఎంఈఓ వెంకట్‌రావు, ప్రధానోపాధ్యాయురాలు ప్రత్యూష, మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, కేదారేశ్వర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాబన్న, రమాకాంత్, వివిధ పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

జనవరి 19న ఆర్యవైశ్య వివాహ పరిచయ వేదిక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జనవరి 19న ఆర్యవైశ్య వధూవర పరిచయ వేదికను నిర్వహించడం జరుగుతుందని ఆర్యవైశ్య పట్టణ సంఘం ప్రధాన కార్యదర్శి హరీష్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని శ్రీవాసవి కన్యక పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పరిచయ వేదిక పోస్టర్లను విడుదల చేశారు. ఆలయ అర్చకులు అక్షయ్ పంతులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఆర్యవైశ్య పట్టణ సంఘం ఆధ్వర్యంలో వధూవర పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి హరీష్ తెలిపారు. మావల మండల కేంద్రంలోని చిల్కూరి లక్ష్మీ గార్డెన్‌లో జనవరి 19న ఉదయం 9.30 నిమిషాల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరిచయ వేదిక ఉంటుందని తెలిపారు. తెలంగాణ, మహారాష్ట్ర, ఏపీల నుంచి వధూవరులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్ కొత్తవార్, గిరిష్, నర్సిములు, ప్రసాద్, ఉల్లాస్, పాల్దే ప్రసాద్, సంజయ్, జయ, సునైన, సంతోషి, సరిత పాల్గొన్నారు.